


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

105

(22 డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మొన్న** ఒక పెద్దమనిషి డాక్టరుగారి వద్దకు వచ్చి తన ఆరోగ్యం బాగోలేదని చెప్పాడు.

డాక్టరుగారు "ఏమిటి మీ అసలు కంప్లయింటు? అని అడిగారు.

దానికా పెద్ద మనిషి "అన్నిటికంటె ముఖ్యమైన బాధ రాత్రిళ్ళు బొత్తిగా నిద్రపట్టదు. ఏ తెల్లవారు ఝామునకో కొంచెం ఇట్టా కునుకు వస్తుంది - అట్టా మెళుకువ వస్తుంది" అన్నాడు.

"మీకిలా నిద్రపట్టకపోవడం ఎన్నాళ్ళనుంచి? అన్నాడు డాక్టరుగారు.

"ముఖ్యంగా మూడు నెలలనుంచి అనుకోండి. అంతకు ముందింత విపరీతం లేదు. రోజుకో రెండు గంటలు నిద్రపోయే వాణ్ణి" అన్నాడాయన.

"మూడు నెలలనుంచా? తలపోటు వుందా?" అని డాక్టరు ప్రశ్న.

"ఉండదు మరీ కొంచెం వుంటుంది"

"కళ్ళుపోట్లా?"

"అయ్యో వాటికేం. రోజూ వుంటాయి."

"నిద్రపట్టకపోతే ఏం చేస్తూ వుంటారు. చదవడం అభ్యాసం వుందా?"

"అప్పుడప్పుడూ చదువుతా! అదైనా బుర్రకు ఎక్కదు"

"సరే మూడు మాత్రలిస్తాను. రాత్రిళ్ళు పడుకోబోయేప్పుడు వేసుకోండి. రాత్రి అన్నం తక్కువ తినండి. వీలైతే రాత్రిళ్ళు మాడుకు చమురు అంటించుకోండి. అంత కన్నా ఏం లేదు" అన్నాడు డాక్టరుగారు.

"ఈ మాత్రలతో నిద్రపడుతుందంటారా?" అని ప్రశ్న.

"ఓ! కుంభకర్ణ నిద్ర. మీకెందుకు మీరు వేసుకోండి" అని చీటీ ఇచ్చారు డాక్టరుగారు.

ఆ పెద్దమనిషి వెడుతూ వెడుతూ నావంక చూసి "రాత్రిళ్ళు నిద్ర తక్కువ" అన్నాడు. నేనేదో జాలిపడతానన్నట్లు.

"నాకు మాత్రం పట్టి ఏడుస్తుందేమిటి? తెల్లవార్లూ గడియారం ప్రక్కమీద పెట్టుకుని కూర్చుంటాను" అనుకున్నాను మనస్సులో. కానీ ఇతరులపట్ల సానుభూతి ప్రకటించడం మన ధర్మం గనుక ఆయన చెప్పగానే "అలాగా పాపం. నిద్ర పడుతుంది లెండి. మాత్రలు ఇచ్చానుగా" అన్నాను. ఆయన నవ్వుతూ వెళ్ళిపోయారు.

వైద్యశాస్త్ర రీత్యా డాక్టరుగారు ఆయన్ని కొన్ని ప్రశ్నలు వేశారు. అంతవరకే జవాబులు సంపాదించారు. కానీ మానసిక శాస్త్రంరీత్యా ముఖ్యంగా ఈ రోజుల్లో వెయ్యవలసిన ప్రశ్నలు కొన్ని వున్నాయి. వాటిని కొన్నిటిని మాత్రం ఉదహరిస్తాను.

"మీది అద్దె ఇల్లా! స్వంత ఇల్లా అద్దె ఇల్లయితే ప్రతినెలా అద్దె కడుతున్నారా? పంపునీళ్ళు, వాకిట్లో వూడ్పు వగైరాలను గురించిన తగాదా లేమైనా వున్నాయా? ఇస్తానన్న రోజుకి ఇవ్వలేకపోయిన బాకీలేమైనా వున్నాయా? అవి ఆఫీసుకి దగ్గరలో దాపుల్లో వున్నాయా?"

"పై అధికారి ఈమధ్య ఏమైనా నోరు చేసుకున్నాడా? చెయ్యదగిన మేలు చెయ్యకుండా అడ్డుపడుతున్నాడా?"

"పెళ్ళికి ఎదిగిన ఆడపిల్ల వుందా? చదువు మానేసి వూరువెంట తిరిగే పుత్రరత్నాలున్నారా?

"కోడలు వేరుపడతానని, కొడుకు కొంపచీలుస్తాననీ గొడవ చేస్తున్నారా?"

"కొంపలో గుట్టు గోడదాటి బయటికి ప్రయాణించిందా?

ఇలాంటి కారణాలు అనేకం వుండవచ్చు నిద్రలేకపోవడానికి. ప్రణయగాథల్లోకి పోతే ప్రియులకు విరహంలో, విప్రలంబంలో నిద్రపట్టకపోవడమంటూ వుంటుంది.

"జొన్న చేనుకాడ

సొగసు కత్తెను చూసి

నిన్నటేళ నించి నిద్రలేదు" - అన్నాడొక జానపద నాయకుడు. ఒక చదువుకున్న మగువ ప్రియునికి ఉత్తరం వ్రాస్తూ మూడు నెలలకు పైగా నీ దర్శనం కాలేదని చెప్పడానికి బదులు "వందరోజులు నిద్రహరించిన ఓ వన్నెకాడా!" అని పేర్కొన్నదట.

పూర్వకాలంలో మహారాజులకు సైన్యాలకు శత్రువుల్ని తలచినప్పుడు నిద్ర అదృశ్యమైపోయేది. "నిద్దురరాదు కన్నులకు నీదగు పేరును విన్నమాత్రమే" అనీ, "నిన్ను తలచినప్పటినుంచీ నిద్రలేదు" అని చెప్పుకునేవారు పాపం.

అన్నట్టు రుక్మిణిదేవి తనను రాక్షస వివాహం చేసుకోవలసిందిగా బ్రాహ్మణోత్తమునితో కబురు పంపుతూ "కూరుకు రాదు రేయి" అన్నది. తనకోసం నిద్రమానుకుని అలా కూర్చుంటుందని వినినప్పుడు కృష్ణుని మనస్సు కరగకుండా వుంటుందా? నీ మూలంగా నిద్రవుండటంలేదనేది ఒక విధమైన అపీలు. దానికి చర్య వెంటనే వుంటుందని ఆశాభావం కలగడంలో ఆశ్చర్యంలేదు.

నిద్రలో అనేకరకాలున్నాయి. కొందరు కేవలం నిద్రపోతు రకాల క్రింద జమకడుతూ వుంటారు పాపం. కొందరికి నిద్ర తమ స్వాధీనంలో వుంటుంది. కొందరిని నిద్ర లాగి చెంపకాయ కొట్టి నిద్రపుచ్చుతుంది దాని ఇష్టం వచ్చినప్పుడు. ఏ పనిలో వున్నా, ఎంత బాధ్యత వహించినా నిద్రవచ్చి వారి చెవిదగ్గర 'అలోజు' వాయించి హాయిగా నిద్రపుచ్చుతుంది.

నిద్రపోతున్న వాళ్ళను లేవడం మహాపాపాల్లో ఒకటి అని చాలామంది అంటూ వుంటారు. కానీ పాపం చాలామందికి ఈరోజుల్లో నిద్రమేల్కొని చేయవలసిన వృత్తులు లభిస్తాయి. వాళ్ళు రాత్రిళ్ళను పగలుగా చేసుకుని జీవిస్తూ వుంటారు. హాయిగా గుర్రాలు కట్టవలసిన వేళ పొట్టను జ్ఞాపకం చేసుకుని లొట్టలు పోయిన కళ్ళతో తమని తాము తిట్టుకుంటూ కాలం గడుపుతూ వుంటారు.

నాగరికత పెరిగిన కొద్దీ రాత్రికీ పగలికీ తేడా కూడా తరిగిపోతోంది. క్రమక్రమంగా పూర్వం ప్రణయజీవులు, ఋణగ్రస్థులు, చోరులు వగైరాలు మాత్రమే నిద్రకు వీళ్ళు వదులుకునేవారు. ఇప్పుడెన్నెన్ని వృత్తుల్లోవారో, నిశిని బలవంతంగా బయటకు నెట్టుతూ పాటుపడవాల్సివస్తోంది.

కొందరికి కొన్నాళ్ళు రాత్రిళ్ళు, కొన్నాళ్ళు పగలు షిఫ్టులుంటాయి. వారో వారం సూర్యవంశపు రాజుల క్రిందా, ఒక వారం చంద్రవంశం రాజులక్రిందా జమపడుతూ వుంటారు. అలాటివారెవరైనా కనిపించినప్పుడు "రాత్రి డ్యూటీయా? పగలా? " అని అడగడానికి బదులు "సూర్యవంశమా! చంద్రవంశమా!" అనడం జరుగుతూ వుంటుంది.

ఇలాటి రాత్రిళ్ళు నిద్రమేల్కొని పని చేసేవాడికి ఎప్పుడో అప్పుడు కునికిపాట్లు రాకమానవు. వాళ్ళూ నరులేగాని, విలింపులుకారుగా? అందువల్ల కూడా ఒక్కొక్కప్పుడు మాట రావడం ఉద్యోగాలు పోవడం తటస్థిస్తూ వుంటుంది. పై అధికారులు జాలిగలవారైతే తప్ప తిప్పలు తప్పవు.

ఈ సందర్భంలో అబ్రహాం లింకన్ జూపిన జాలి కథ ఒకటి వుంది. ఒకసారి లింకన్ సైనికుల్ని తనిఖీ చేయడానికి వెళ్ళాడట. రాత్రిపూట అక్కడ ఒక 'సెంట్రీ' తుపాకి ఒక మూలపెట్టి కునుకుపాట్లు పడుతున్నాడుట. లింకన్ చూశాడు. అతనిపైన జాలి కలిగింది. తను అమెరికా ప్రెసిడెంటుననే మాట కూడా మరిచిపోయి, ఆ తుపాకి తన భుజాన పెట్టుకుని పహరా ప్రారంభించాడుట.

కొంతసేపటికి ఆ సెంట్రీకి మెళుకువ వచ్చింది. లింకన్ అలా పహారా చేయడం చూశాడు. నిలువునా కూలిపోయినంతపని అయింది. గజగజ ఒణుకుతున్నాడు. నోటమాట రాలేదు. లింకన్ ఏమీ అనకుండా తుపాకి అతని భుజాన పెట్టి 'పహారా సాగించు' అని చెప్పి వెళ్ళిపోయాడుట.

సెంట్రీ నిద్రపోవడం చాలా ప్రమాదకరమైన విషయం. అలాటి సందర్భంలో కూడా లింకన్ అతనిపైన జాలి వహించడం ఒక్కటే కాక తాను అతని బదులు పహారా తిరగడంలో ఎంతో ఉదారత గోచరిస్తుంది. నిద్రలో గల బాధలు, సాధనలు, చాలావున్నాయి. అసలు అరవైయేళ్ళ జీవితంలో నిద్రపోని ఒక విచిత్ర పురుషుని వృత్తాంతం ఈసారి వివరిస్తాను.

Post your comments